నమస్తే తెలంగాణ
నిజామాబాద్, గురువారం 1 మే 2025
THURSDAY MAY 1, 2025

## ధాన్యం సేకరణలో పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- వీసీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్, తుమ్మల


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

కంఠేశ్వర్, ఏప్రిల్ 30 : యాసంగి సాగు ద్వారా రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడులు వచ్చాయని, ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్, తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. వారు బుధవారం పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ధాన్యం సేకరణపై సమీక్షించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈసారి యాసంగిలో రాష్ట్రంలో 54.89 లక్షల ఎకరాల్లో వరి పంట సాగయ్యిందని, 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వెల్లడించారు. జిల్లాలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకొని, 700 పైచిలుకు కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 5.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంత్రులకు వివరించారు. మే చివరి వారం వరకు లక్ష్యం మేరకు ధాన్యం సేకరించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి రూ. 875 కోట్ల మేర బిల్లుల చెల్లింపులు చేశామని తెలిపారు. సన్నాలకు సంబంధించిన బోనస్ డబ్బులు మంజూరు కావాల్సిఉందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా ‘అక్షయ తృతీయ’

సుభాష్‌నగర్, ఏప్రిల్ 30 : అక్షయతృతీయ సందర్భంగా జిల్లాలో బుధవారం పెద్దసంఖ్యలో శుభకార్యాలు జరిగాయి. జిల్లా కేంద్రంలోనే సుమారు 50 జంటల పెండ్లిళ్లు జరిగాయి. దీంతో ఫంక్షన్‌హాళ్లు సందడిగా మారాయి. ఇందూరు గో సేవా సమితి ఆధ్వర్యంలో దేవీరోడ్‌లోని లక్ష్మీనారాయణ ఆలయంలో పరిశుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 70 మంది కార్యకర్తలు ఇత్తడి, పంచలోహ విగ్రహాలను గంగాజలం, పంచామృతాలతో శుద్ధి చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన


నగరంలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

కంఠేశ్వర్, ఏప్రిల్ 30 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ బుధవారం పరిశీలించారు. నగరంలోని 7, 25వ డివిజన్లలో సర్వేను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

# ‘పది’ ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం వెల్లడి కాగా.. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ మార్కులు సాధించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఇందల్వాయి మండలంలోని గురుకుల పాఠశాలలో, ఎల్లారెడ్డిపల్లి, తిర్మన్‌పల్లి, గన్నారం, అన్సాన్‌పల్లి, సిర్నాపల్లి, ఇందల్వాయి, నల్లవెల్లిలోని కేజీబీవీ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు. గన్నారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎస్. హర్షజ్ఞ 566 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు.


రుద్రూర్ మండలంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీనివాస్‌రావు తెలిపారు. రుద్రూర్ కేజీబీవీ, ఆదర్శపాఠశాల, బాలకల పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. రుద్రూర్ కేజీబీవీకి చెందిన శివాని 577 మార్కులతో మండలంలో టాపర్‌గా నిలిచినట్లు వెల్లడించారు.

రూరల్ మండలంలోని అశోక్‌ఫారం కేజీబీవీలో 32 మంది విద్యార్థినులకు అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అక్షయ 559, వర్షిణి 540, మధుమిత 537, భాను 535, రిషిక 525 మార్కులు సాధించినట్లు వివరించారు.

ధర్పల్లిలో 91.15 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆదర్శ పాఠశాలకు చెందిన కల్యాణి 558 మార్కులు సాధించినట్లు తెలిపారు.

డిచ్‌పల్లి మండలంలో 96.85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

పొతంగల్ మండలంలో సుంకిని, కల్లూర్, పొతంగల్ ఉర్దూ మీడియం పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శంకర్ తెలిపారు.


రక్షిత (585) డొంకేశ్వర్ జడ్పీహెచ్‌ఎస్ | గంగాగోపాల్ (585) బెజ్జోరా జడ్పీహెచ్‌ఎస్ | హరిణి (579) జక్రాన్‌పల్లి ఆదర్శపాఠశాల | ఎం. అరవింద్ (577) మోర్తాడ్ ఎంజేపీటీబీసీడబ్ల్యూఈఐస్ | సబాసాదియా (572) చౌటిపల్లి జడ్పీహెచ్‌ఎస్
అయోషా జబీన్ (569) రెంజల్ టీజీఆర్ఎంఎస్ | హర్షజ్ఞ (566) గన్నారం జడ్పీహెచ్‌ఎస్ | అక్షయ (559) అశోక్‌ఫారం కేజీబీవీ | అస్నిహా బను (554) ఏర్గట్ల జడ్పీహెచ్‌ఎస్ | రితిక (546) పొతంగల్ జడ్పీహెచ్‌ఎస్

పొతంగల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని 546 మార్కులతో మండల టాపర్‌గా, రెండో స్థానంలో పొతంగల్ ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థిని చాంద్‌బీ 538 నిలిచినట్లు తెలిపారు.

జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాలలో 90 మందికి 90 మంది పాసైనట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. హరిణి 579 మార్కులు సాధించినట్లు తెలిపారు.

నవీపేట మండలంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో సక్కి అశోక్ తెలిపారు. మండల టాపర్‌గా నవీపేట గురుకుల పాఠశాల విద్యార్థిని నేనావత్ లావణ్య 577 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. మోకన్‌పల్లి కస్తూర్బా పాఠశాల, నవీపేట మోడల్ స్కూల్, జన్నేపల్లి పాఠశాల, నవీపేట బాలికల గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

మాక్లూర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. మదన్‌పల్లి పాఠశాల విద్యార్థిని అలేఖ్య 577 మార్కులు సాధించి ప్రథమస్థానం, మానిక్‌బండార్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మనోజ్ఞ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రవీణ 585, జయశ్రీ 580, పూజ 580, రితిక 577, వైష్ణవి 575, వర్ష 575 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు. గుత్ప సీపీఆర్ఎంఎస్ పాఠశాల విద్యార్థినులు ప్రణవి 576, ఆసిఫా573 మార్కులు సాధించారని హెచ్‌ఎం నిత్యానందం తెలిపారు. కేజీబీవీలో అక్షయ 553, స్వప్న దీపిక 537 సాధించారని ఎస్‌వో స్రవంతి తెలిపారు.

రెంజల్ మండలంలో 98.87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. మండల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన అయోషా జబీన్ 569 మార్కులు, కందకుర్తి ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థిని ఖనిజ్‌ఫాతిమా 529 మార్కులు సాధించినట్లు తెలిపారు.

నందిపేట్ మండలంలోని 9 జడ్పీహెచ్‌ఎస్‌లలో 100 శాతం, డొంకేశ్వర్‌లోని జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని రక్షిత 585 మార్కులు సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ జడ్పీహెచ్‌ఎస్, వన్నెల్(బీ), కస్తూర్బా బాలికల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాల, మహాత్మా జ్యోతిభా పూలే పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో తెలిపారు.

భీమ్‌గల్ మండలంలోని 15 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో స్వామి తెలిపారు. బెజ్జోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఒరగంటి గంగాగోపాల్ 585 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు.

మోర్తాడ్ మండలంలో 99 శాతం, కమ్మర్‌పల్లి మండలంలో 98.88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు ఆంధ్రయ్య, సమ్మిరెడ్డి తెలిపారు. జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలకు చెందిన 115 మంది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మహాత్మాజ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి 577 మార్కులు సాధించి మోర్తాడ్ మండల టాపర్‌గా నిలిచాడు. సుంకెట్ ప్రభుత్వపాఠశాలకు చెందిన బండి అనుశ్రీ 561 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచింది. చౌటపల్లి ఉన్నతపాఠశాలకు చెందిన సబాసాదియా 572 మార్కులతో మండలటాపర్‌గా, శ్రీవల్లి 571 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచారు.

ఏర్గట్ల మండలంలో 99.18 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఆనంద్‌రావు తెలిపారు. ఏర్గట్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని అస్నిహా బను 554 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. మండలంలో ఉత్తీర్ణత శాతం 99.18 నమోదైనట్లు పేర్కొన్నారు. సిరికొండ మండలంలో 17 పాఠశాలలకు 15 పాఠశాలు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రాములు తెలిపారు. ఆదర్శపాఠశాలకు చెందిన నందిని 572, హర్షిత 562 మార్కులు సాధించినట్లు తెలిపారు.

## సంక్షిప్తంగా..

- **ఘనంగా శ్రీశ్రీ జయంతి** - సుభాష్‌నగర్, ఏప్రిల్ 30 : నగరంలోని సుభాష్‌నగర్‌లోని సీనియర్ సిటిజన్స్ భవనంలో పెన్షనర్స్ మహాకవి శ్రీశ్రీ 115వ జయంతిని బుధవారం నిర్వహించారు. ప్రముఖ కవి సిర్పలింగంతోపాటు 15 మంది కవులు శ్రీశ్రీ పాటలు, కవితలను వినిపించారు. కార్యక్రమంలో రమణాచారి, తొగర్ల సురేశ్, రాధాకృష్ణ, సాయికుమార్, రాంమోహన్‌రావు, నర్సింహులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.
- **మేడే పోస్టర్ల ఆవిష్కరణ** - డిచ్‌పల్లి, ఏప్రిల్ 30 : మండలకేంద్రంలో మే డే పోస్టర్లను ఏఐకేఎంఎస్ నాయకుడు గంగాధర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి, కార్మికులను బజారుపాలు చేస్తున్నదని అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి వీటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో భారతి, గంగామణి, రాజమణి, రాణి, పోసాని, రాజవ్వ పాల్గొన్నారు.
- **పలు అభివృద్ధి పనులకు భూమిపూజ** - ధర్పల్లి, ఏప్రిల్ 30 : మండలకేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. మండలకేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రం, గోవింద్‌పల్లి, బెల్యాతండా, మరియాతండా, దమ్మన్నపేట్, ఎస్‌బీతండా, ఇందిరానగర్ తండా తదితర గ్రామాల్లో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. అనంతరం మండలకేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో బాలకృష్ణ, సొసైటీ చైర్మన్లు చెలిమెల చిన్నారెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.
- **జక్రాన్‌పల్లి ఎస్సైగా మాలిక్ రహమాన్** - జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 30 : జక్రాన్‌పల్లి ఎస్సైగా మాలిక్ రహమాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తిరుపతి వీఆర్‌కు బదిలీ కాగా.. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద ఎస్సైగా పనిచేసిన మాలిక్ రహమాన్ జక్రాన్‌పల్లికి బదిలీపై వచ్చారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.
- **ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌కు సన్మానం** - సారంగాపూర్, ఏప్రిల్ 30 : అర్బన్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న పెరిక సాయిలు ఉద్యోగ విరమణ సందర్భంగా పక్కనే ఉన్న యూనివర్సిటీ బీఈడీ కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఆ దంపతులను బుధవారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పార్కు సిబ్బంది రేఖ, సతీశ్, పోశెట్టి, గణేశ్, నర్సింహారెడ్డి, సుజత్, ప్రసాద్, శశి, యాస్మిన్ పాల్గొన్నారు.


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ‘కాకతీయ’ యాజమాన్యం, సిబ్బంది

## ‘కాకతీయ’ విద్యార్థుల విజయఢంకా

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 30 : జిల్లాకేంద్రంలోని కాకతీయ పాఠశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ ఎస్. క్రితి 596 మార్కులు, నిత్యాష్ 591, అఖిల్ 590, కృతి 587, శ్రేయస్ 586, వర్షిణి 586, కౌశిక్ ప్రసాద్ 585, అదిబా సిద్ధిక్ 585, గౌతమ్ 585, జస్వంత్ 584, అస్తా గౌర్ 583, భావని 582, యోచన 582, అక్షర 581, సహస్ర 580 మార్కులు సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ఇందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను కాకతీయ విద్యాసంస్థల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, డైరెక్టర్లు తేజస్విని, రామోజీరావు, ప్రిన్సిపాల్ ఫరీదుద్దీన్ అభినందించారు. ఒలింపియాడ్ స్కూల్‌లో స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ ఉండడం, ప్రత్యేక నిపుణులతో విద్యాబోధన చేయిస్తుండడంతో ఇంటర్మీడియట్‌లో సైతం ఐఐటీ మెడికల్ పరీక్షల్లో రాణిస్తున్నట్లు తెలిపారు.

## ఇందూర్ హైస్కూల్ జయకేతనం


టి.సంజన 588 | ఎం.ఐశ్వర్య 582 | జె.సంజన 572 | డి.శివకీర్తన 571 | బి.తరుణ్ నాయక్ 567

బోధన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో బోధన్ పట్టణంలోని ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ మార్కులు సాధించి తమ సత్తా చాటారు. టి.సంజన మొత్తం 600 మార్కులకుగానూ 588 మార్కులు సాధించి ప్రతిభను చాటింది. ఎం.ఐశ్వర్య 582 మార్కులు, జె.సంజన 572 మార్కులు, డి.శివకీర్తన 571 మార్కులు, బి.తరుణ్ నాయక్ 567 మార్కులు సాధించారు. జె.మాధురి 565 మార్కులు, ప్రద్యుమ్న మణికంఠ 564 మార్కులు తెచ్చుకోగా జి.యశస్వి, బి.కారుణ్య, పి.విశ్వసాయి 562 మార్కులు, ఎ.శ్రీనిధి, ఐ.శ్రీనిధి 560 మార్కులు చొప్పున సాధించారు. పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించారు. 120 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా తెచ్చుకున్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిశోర్ అభినందించారు.

## విజయసాయి విజయదుందుభి


పి.శ్రీనిధి 584 | డి.ప్రతీక్ భగత్ 584 | ఎం.వైభవి 583 | మిఫ్రా ఫాతిమా 583 | కె.కౌశిక్ కళ్యాణ్ 583

బోధన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో బోధన్‌లోని శ్రీ విజయసాయి హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి విజయదుందుభి మోగించారు. హైస్కూల్‌కు చెందిన 33 మంది విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ఏ-1 గ్రేడ్ సాధించారు. పి.శ్రీనిధి, డి.ప్రతీక్ భగత్ అనే విద్యార్థులు మొత్తం 600 మార్కులకుగానూ 584 మార్కులు సాధించి ప్రతిభను చాటారు. ముగ్గురు విద్యార్థులు ఎన్.వైభవి, మిఫ్రా ఫాతిమా, కె.కౌశిక్ కళ్యాణ్ 583 మార్కులు సాధించారు. ఎం.సాయిప్రసన్న, ఎం.ధరణేశ్వర్ అనే విద్యార్థులు 582 మార్కులు, ఎన్.స్వీకృతి, బి.తేజశ్రీ 581 మార్కులు సాధించారు. వై.ఆకృతి, ఎం.ఆరాధ్యకు 580 మార్కులు వచ్చాయి. మొత్తం 414 మంది ఉత్తీర్ణులై నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్ అభినందించారు.

## పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 30: పట్టణంలోని కమలాకర్ నెహ్రూ కాలనీ, టీచర్స్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొహిబిషన్ ఐపీఎస్ సాయి కిరణ్ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, రాత్రి సమయాల్లో అనవసరంగా వాహనాలపై తిరగవద్దని సూచించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఇతర రాష్ట్రాలు, బయటి దేశాల నుంచి వచ్చిన వారిపై దృష్టి సారించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, తొమ్మిది మంది ఎస్సైలు, ఏఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులు, రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 30: పట్టణానికి చెందిన జనార్దన్, రవి అనారోగ్యం కారణంగా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఆర్థిక సాయం కింద చెక్కులు మంజూరయ్యాయి. చెక్కులను బాధిత కుటుంబీకులకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి బుధవారం అందజేశారు.

## బోధన్‌లో వాహనాల తనిఖీ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 30: బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద బుధవారం ఉదయం ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. పలు ద్విచక్రవాహనాలు ఆపి, వాహనాలకు చెందిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. అనంతరం వాహన యజమానులకు మోటారు వాహనాల చట్టంపై ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అవగాహన కల్పించారు.

## ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు

రెంజల్, ఏప్రిల్ 30 : మండలం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై కె.. చంద్రమోహన్ బుధవారం తెలిపారు. నీలా శివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సాటాపూర్ తెలంగాణ చౌరస్తా వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వాటిని సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

## ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

వేల్పూర్, ఏప్రిల్ 30: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలోని పెద్ద చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న వారికి బుధవారం ఓఆర్‌ఎస్ గ్లూకోస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ వైస్‌ప్రెసిడెంట్ టక్కరి గంగాధర్, లింగేశ్వర్, రమేశ్, మోహన్, రాజేందర్, అలీమొద్దీన్ పాల్గొన్నారు.

# ఘనంగా బసవేశ్వర జయంతి


బోధన్‌లో బసవేశ్వర జయంతిలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, అధికారులు

ఖలీల్‌వాడి/ పొతంగల్/ రుద్రూర్/ శక్కర్‌నగర్, ఏప్రిల్ 30 : సమాజంలో మూఢాచారాలను పారదోలి, కుల, మత రహిత సమాజ నిర్మాణానికి కృషిచేసిన మహాత్మా బసవేశ్వర జయంతిని జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు.. బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, ఫహీం, శంకర్, హర్షవర్ధన్‌రావు, విజయ్‌కుమార్, చరణ్, కృష్ణ పాల్గొన్నారు. పొతంగల్ మండలం కొల్లూర్‌తోపాటు పలు గ్రామాల్లో బసవేశ్వర జయంతి నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లోని గైనిగుట్టల బసవేశ్వరాలయంలో బసవేశ్వర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి పరమేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో బసవేశ్వరుడికి ఊయల సేవ నిర్వహించారు.

బోధన్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బసవేశ్వర జయంతి నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటానికి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, పరిపాలనాధికారి వెంకటేశ్వర్లు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు దేశాయ్, కార్యదర్శి యాదవ రావు, జంగమ సమాజ్ జిల్లా కన్వీనర్ పురానే అజయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు నర్సింగప్ప తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్‌చారికి ‘శ్రీకాంత్‌చారి మెమోరియల్’ అవార్డు


హైదరాబాద్‌లో తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి తదితరుల చేతుల మీదుగా ‘శ్రీకాంత్ చారి మెమోరియల్’ అవార్డు అందుకుంటున్న మారోజు సుధాకర్ చారి

శక్కర్‌నగర్, ఏప్రిల్ 30: బోధన్ పట్టణానికి చెందిన మారోజు సుధాకర్ చారికి హైదరాబాద్‌లో ‘శ్రీకాంత్ చారీ మెమోరియల్ ’ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని పెద్దబావి మల్లా రెడ్డి గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో నింగినేల, మేము సైతం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమస్ఫూర్తి ప్రదాత, అమరుడు కాసోజు శ్రీకాంత్ చారి మెమోరియల్ అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సేవలు అందించిన పలువురిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. బోధన్‌కు చెందిన మారోజు సుధాకర్‌చారిని ఈ అవార్డుకు ఎంపిక చేసి, బుధవారంతెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, జేఏసీ నేత దరువు అంజన్న చేతుల మీదుగా అందజేశారు.

## ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి


అధికారులకు సూచనలు చేస్తున్న బోధన్ ఎమ్మెల్యే

బోధన్, ఏప్రిల్ 30: బోధన్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మాజీ మంత్రి,ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో నెలకొన్న సమస్యలపై కమిషనర్ వెంకటనారాయణను అడిగారు. పట్టణంలో చెత్తను తొలగించే వాహనాల మరమ్మతులు చేయించాలని సూచించారు. వాహనాలు సరిపోవడం లేదనే పలువురు చేసిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ ట్రాలీల సైజ్‌ను నిబంధనల మేరకు కొంత పెంచాలని, ఇందుకు ఎంవీఐ అనుమతి తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా చూడాలన్నారు. అనంతరం గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా మరో విద్యుత్ ఉప కేంద్రం మంజూరీపై హర్షం వ్యక్తంచేస్తూ సాలూరా మండలం జాడీ జమాల్‌పూర్ గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానించారు.

## ‘భూభారతి’తో సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం

### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


జక్రాన్‌పల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా పెండింగ్‌లోని సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం కానున్నాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ హాజరై రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. భూసమస్యలను సంబంధిత అధికారి ఎన్ని రోజుల్లో పరిష్కరించాలనే విషయమై స్పష్టమైన మార్గదర్శకాలు పొందుపరుస్తూ నిర్దిష్ట గడువు విధించారని తెలిపారు. మే, జూన్‌లో గ్రామాల వారీగా నిర్వహించే రైతుసదస్సుల్లో అధికారులు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. అనంతరం రైతుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ చట్టంలో ఎలాంటి అంశాలుంటే బాగుంటుందనే దానిపై సలహాలు కూడా అందించవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ కిరణ్మయి, ఏవో దేవిక, మునిపల్లి, అర్గుల్, బ్రాహ్మణ్‌పల్లి, కొలిప్యాక్, సొసైటీల చైర్మన్లు సాయరెడ్డి, ఆర్మూర్ గంగారెడ్డి, కాటిపల్లి నర్సారెడ్డి, నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ‘భూభారతి’ని సద్వినియోగం చేసుకోవాలి


సారంగాపూర్, ఏప్రిల్ 30 : భూములకు సంబంధించిన సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించడానికి ప్రభుత్వం భూభారతిని అమలుచేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని గుండారం గ్రామంలో బుధవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిరుధ్, మండల వ్యవసాయాధికారి హీరాజాదవ్, గుండారం సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, గిర్దావర్లు హరీశ్ రెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల రీ వెరిఫికేషన్

భీమ్‌గల్, ఏప్రిల్ 30: మండలంలోని సంతోష్ నగర్ తండా, సుదర్శన్ నగర్ తండా గ్రామ పంచాయతీల పరిధిలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల రీవెరిఫికేషన్‌ను ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లకు వెళ్లి సర్వే నిర్వహించారు. వెంట ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం

భీమ్‌గల్, ఏప్రిల్ 30: మండలంలోని గోన్‌గొప్పుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత రాగి అంబలి కేంద్రాన్ని ముచ్కూర్ సొసైటీ చైర్మన్ బంగ్ల దేవేందర్ దంపతులు బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని హరిహర క్షేత్ర దేవాలయ ఆవరణలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవికాలం ముగిసే వరకు అంబలి కేంద్రం కొనసాగుతుందని తెలిపారు.


మండలంలోని సికింద్రాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గరిపల్లి గంగాధర్ గౌడ్ కూతురు వివాహ వేడుక మండల కేంద్రంలో నిర్వహించగా.. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు
– భీమ్‌గల్, ఏప్రిల్ 30

## రైతుభరోసా ఇప్పించాలి

మోర్తాడ్, ఏప్రిల్ 30: కమ్మర్‌పల్లి మండలకేంద్రం పరిధిలోని సర్వేనంబర్ 386లో ఉన్న రైతులకు రైతుభరోసా ఇప్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెటరవి బుధవారం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...సర్వేనంబర్ 386లో వ్యవసాయం చేస్తున్న రైతులెవరికీ రైతుభరోసా రాలేదని తమ దృష్టికి వచ్చిందని, వారందరికీ వచ్చేలా చూడాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మల్లయ్య, రంజిత్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు